సాక్షి
అన్నమయ్య జిల్లా
శుక్రవారం । 17 । అక్టోబర్ । 2025

I



ఆదాయం ఢమాల్!
గత రెండేళ్లతో పోల్చుకుంటే రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖలో ఈ ఏడాది ఆదాయం లక్ష్యానికి చాలా దూరంలో నిలిచిపోయింది.
-IIలో



20 రోజుల క్రితం అదృశ్యమై..
మెడికల్ షాపు యజమాని శ్రీకాంత్ అదృశ్యం కేసు మిస్టరీ వీడింది. 20 రోజుల తర్వాత హంద్రీ నీవా కాలువలో శ్రీకాంత్ మృతదేహం లభ్యమైంది.
-IIలో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.190	రూ.230
రెండోరకం	రూ.130	రూ.180

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 140 మెట్రిక్ టన్నులు



ఎంత కష్టం!





బస్సులు లేక బోసిపోయిన మదనపల్లె ఆర్టీసీ బస్టాండు (ఇన్‌సెట్) బస్సులో సీట్లు నిండిపోయినా ఎక్కుతున్న ప్రయాణికులు

- ప్రధాని పర్యటన నేపథ్యంలో కర్నూలుకు బస్సులు
- జిల్లా నుంచి సుమారు 350 బస్సులను పంపించిన ఆర్టీసీ అధికారులు
- ప్రజలకు తప్పని అవస్థలు

సాక్షి రాయచోటి: దేశ ప్రధానమంత్రి నరేంద్రమోదీ కర్నూలు జిల్లా పర్యటనకు రావడం.. జనసమీకరణ నేపథ్యంలో కూటమి సర్కార్ బస్సులన్నింటినీ అక్కడికి తరలించడంతో ప్రయాణికులకు నిరీక్షణ తప్పలేదు. అధిక సంఖ్యలో బస్సులను కర్నూలుకు పంపించడంతో స్థానికంగా ప్రయాణించాలనుకున్న వారి పరిస్థితి ఇబ్బందికరంగా మారింది. జిల్లాలోని వివిధ డిపోల నుంచి సుమారు 350 బస్సులను తీసుకెళ్లడంతో ఉద్యోగులు, మహిళలు, ప్రజలు పడరాని పాట్లు పడ్డారు. బస్టాండ్లలో ఎదురు చూస్తున్న ప్రయాణికులకు ఎప్పుడో ఒకటి, అర కనిపించినా బస్సుల్లో సీట్ల కోసం ఎగబడటం కనిపించింది.

- జిల్లాలోని ఐదు ఆర్టీసీ డిపోలు ఉన్నాయి. అందుకు సంబంధించి ప్రతిరోజు రూట్ల వారీగా తిరిగే బస్సులు 480 వరకు ఉన్నాయి. కర్నూలు జిల్లాలో సభ జరుగుతున్న తరుణంలో రాయలసీమ జిల్లాలోని పలు డిపోలతోపాటు అన్నమయ్య జిల్లా నుంచి భారీగా బస్సులను తరలించారు. దీంతో ప్రయాణికులు వద్దురా..బాబూ..ఈ ప్రయాణం అనడం కనిపించింది. బుధవారమే బస్సులను తరలించారు. గురువారం ఉదయం నుంచి గంటల తరబడి బస్టాండ్లలో నిరీక్షిస్తే ఒకటి, అర వచ్చిన బస్సుల్లో వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది.



కలకడ: ఆటోస్టాండ్ గామారిన పీలేరు ఆర్టీసీ బస్టాండ్

తప్పని అగచాట్లు

బస్సులు పూర్తి స్థాయిలో లేకపోవడంతో ఎప్పుడో ఒకటి రాగానే ప్రయాణికులు బస్సుల కోసంపరుగులు పెడుతూ సీట్ల కోసం ఎగబడ్డారు. దసరా, సంక్రాంతి పండుగల సమయంలో బస్సుల్లో సీట్ల కోసం ఎలాంటి అగచాట్లు పడతారో అలాంటి పరిస్థితి కనిపించింది. అయితే కనీసం ముందస్తుగా బస్సులు ఉండవన్న సమాచారాన్ని ఆర్టీసీ అధికారులు ఇచ్చి ఉంటే ప్రయాణాన్ని వాయిదా వేసుకునే వారమని పలువురు లబోదిబోమంటున్నారు. మదనపల్లె, రాయచోటి, రాజంపేట, పీలేరు బస్టాండ్లలో వచ్చిన బస్సులు పూర్తిగా రద్దీగా ఉండడంతో వెళ్లలేక పలువురు తమ ప్రయాణాలు వాయిదా వేసుకున్నారు. జిల్లాలో మదనపల్లె-1, 2తోపాటు పీలేరు, రాజంపేట, రాయచోటి డిపోల నుంచి ప్రధాని సభకు భారీగా బస్సులు వెళ్లగా మిగిలిన కొన్ని బస్సులను ప్రయాణీకులకు కేటాయించారు. అయితే దూర ప్రాంతానికి సంబంధించి రాత్రి పూట సర్వీసులైన బెంగుళూరు, హైదరాబాదు చెన్నై, విజయవాడ తదితర వాటిని యదావిధిగా నడిపారు. ఏది ఏమైనా కూటమి సర్కార్ పెద్ద ఎత్తున ప్రతిష్టాత్మకంగా తీసుకుని చేపట్టిన ప్రతి కార్యక్రమం సందర్భంగా ప్రయాణికులకు తిప్పలు తప్పడం లేదు.

న్యూస్‌రీల్

ముగిసిన వర్క్‌షాప్

రాయచోటి: జిల్లాలోని లక్కిరెడ్డిపల్లి, చిన్నమండెం మండలాలను వాతావరణ మార్పులకు అనుగుణంగా వ్యయవసాయంలో మార్పులు పైలెట్ ప్రాజెక్టుకు ఎంపిక చేసినట్లు జిల్లా వ్యవసాయాధికారి జి శివనారాయణ తెలిపారు. ఇందులో భాగంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై జిల్లా, మండలస్థాయిలో నిర్వహించిన రెండు రోజుల వర్క్ షాప్ గురువారం ముగిసింది. వర్క్‌షాప్‌లో జిల్లా, మండలస్థాయి, ప్రైమరీ సెక్టార్ అధికారుల భాగస్వామ్యంతో వార్షిక కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఢిల్లీకి చెందిన వరల్డ్ ఫుడ్ ప్రోగ్రామ్ టీమ్ సభ్యులు బాలాజీ త్రిపాఠి, సుదేష్ణ సేన్, జ్యోతి, రైతు సాధికార సమితి రాష్ట్ర కార్యాలయం నుంచి ఎన్‌వై శాస్త్రి, సౌమ్య కొల్లా, డీపీఎం వెంకటమోహన్, వరల్డ్ ఫుడ్ ప్రోగ్రామ్ ఎస్‌పీఎం డాక్టర్ నరసింహారెడ్డి, చందనల సమన్వయంతో నిర్వహించారు.

రీసర్వే పక్కాగా నిర్వహించాలి



మాట్లాడుతున్న డిప్యూటీ డైరెక్టర్ జయరాజ్

రాయచోటి జగదాంబసెంటర్: ప్రభుత్వ ఆదేశాలు, సూచనల మేరకు రీసర్వే పక్కాగా నిర్వహించాలని ప్రాజెక్ట్ డిప్యూటీ డైరెక్టర్ పీవీ జయరాజ్ పేర్కొన్నారు. గురువారం జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న రీసర్వేపై రాయచోటిలో అధికారులతో ఆయన సమీక్షించారు. ప్రతి రైతుకు జీటీ నోటీసులను అందజేసి వారి సమక్షంలో భూమిని ఆధునిక టెక్నాలజీ రోవర్ ద్వారా సర్వే చేయాలని సూచించారు. అనంతరం రైతులకు రీసర్వే ద్వారా కలిగే లాభాలను వివరించారు.

18న స్కేటింగ్ ఎంపికలు



కడప వైఎస్‌ఆర్ సర్కిల్: ఈ నెల 18న జిల్లా స్కేటింగ్ ఎంపికలు నిర్వహించనున్నట్లు జిల్లా ది రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ కార్యదర్శి ఇస్రాయిల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఎంపికలు యోగి వేమన యూనివర్శిటీ, డీఎస్‌ఏ స్టేడియంలో జరుగుతాయన్నారు. ఇక్కడ ఎంపికైన క్రీడాకారులు 37వ అంతర్ జిల్లాల రోలర్ స్కేటింగ్ పోటీలు నవంబర్ 1 నుంచి 5 వరకు కాకినాడలో జరిగే పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

గండి టెండర్లలో కొన్నింటికి ఆమోదం

చక్రాయపేట: గండి వీరాంజనేయ స్వామి సన్నిధిలో గురువారం నిర్వహించిన టెండర్లలో కొన్నింటికి ఆమోదించి మరి కొన్నింటిని వాయిదా వేసినట్లు ఆలయ సహాయ కమీషనర్ వెంకటసుబ్బయ్య తెలిపారు. టెండర్లలో ప్రధానమైన కొబ్బరికాయల విక్రయ హక్కుకు సంబంధించి పోటీదారులు ధరావత్తు మొత్తం చెల్లించినప్పటికీ పాట పాడేందుకు నిరాసక్తత కనబరిచారు.దీంతో కొబ్బరి కాయల టెండరును వాయిదా వేసినట్లు ప్రకటించారు.సప్లయర్స్ డెకరేషన్ సామాన్లు,విద్యుత్ ప్లంబింగ్ ఆమాగ్రి సరఫరా,స్టేషనరీ,అరటి ఆకుల,మామిడి తోరణములు, వస్త్రాల సరఫరా,తదితరాలను ఆమోదం తెలిపినట్లు చెప్పారు.పూలమాలల సరఫరా,పాదరక్షలు భద్రపరచు హక్కు,నిరుపయోగ సామగ్రి కొనుగోలు తదితరాలను వాయిదా వేశామని వివరించారు. కడప దేవదాయ శాఖ తనిఖీదారుడు శివయ్య,ఆలయ చైర్మన్ కావలి కృష్ణతేజ,మాజీ చైర్మన్‌లు కావలి వీరభాస్కరుడు,వెంకటస్వామి పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం



మాట్లాడుతున్న వీర్రాజు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజనలో భాగంగా జిల్లాలో గల యువకులకు నైపుణ్యాలతో కూడిన డ్రైవింగ్ స్కిల్స్ అభివృద్ధి చేయడంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సహాయంతో డ్రైవింగ్ ట్రైనింగ్ సెంటర్లను ఏర్పాటు చేయడానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఇన్‌చార్జ్ జిల్లా ఉప రవాణా శాఖ కమిషనర్ వీర్రాజు పేర్కొన్నారు. గురువారం నగర శివార్లలోని ఊటుకూరు జిల్లా ఉప రవాణాశాఖ కమిషనర్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇందులో భాగంగా ప్రతి 10 లక్షల జనాభాకు ఒక డ్రైవింగ్ ట్రైనింగ్ సెంటర్ చొప్పున శాంక్షన్ చేయడానికి ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. డ్రైవింగ్ ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటు చేయడానికి ఆసక్తి కల అభ్యర్థులు ఈ నెల 23 సాయంత్రం 5 లోపు వారి ఆసక్తి పత్రాలను, డీపీఆర్ కాపీలను, ఇతర అటాచ్‌మెంట్లను జిల్లా ఉప రవాణా కమిషనర్ కార్యాలయము, వైయస్సార్ కడప జిల్లా లో సబ్మిట్ చేయాలని కోరారు. ఆసక్తి గల సంస్థలు పూర్తి వివరాలు కోసం కేంద్ర రహదారులు, రవాణా శాఖ వెబ్‌సైట్‌లో నుండి పూర్తి వివరాలు పొందవచ్చన్నారు.

పత్రికా స్వేచ్ఛపై కాల కూటమి

ప్రజల గొంతుగా నిలిచి ప్రశ్నిస్తే ప్రభుత్వానికి నచ్చదు..' సాక్షి'పై చంద్రబాబు సర్కార్ కక్షసాధింపుగా వ్యవహరిస్తోంది. సాక్షి ఎడిటర్ ధనంజయరెడ్డితోపాటు పలువురు ప్రాతికేయులపై అక్రమంగా కేసులు పెట్టి వేధిస్తోంది. పత్రిక స్వేచ్ఛకు సంకెళ్లు వేయడంపై సీనియర్ జర్నలిస్టులు, వివిధ సంఘాల నేతలు ఖండిస్తున్నారు.



ఎడిటర్‌పై వేధింపులు తగదు



సాక్షి ఎడిటర్ ధనుంజయరెడ్డిపై పోలీసుల వేధింపులు తగదు. పత్రికల్లో సమాజంలో జరుగుతున్న వివిధ అంశాలను ప్రచురిస్తుంటారు. దానిపై ప్రభుత్వానికి అభ్యంతరాలుంటే వివరణ ఇవ్వాలి తప్ప కేసులు బనాయించి బెదిరించాలని చూడడం సరికాదు. సీఎం చంద్రబాబు అనుసరిస్తున్న ధోరణులు హిట్లర్, ముస్సోలిని లాంటి నియంతల పోకడలను తలపిస్తున్నాయి. పత్రికల గొంతుకను నొక్కా లని చూస్తున్న ప్రభుత్వ వైఖరిని ఖండించడం ద్వారా ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉంది.

– మోపూరి బాలకృష్ణారెడ్డి, జిల్లా అధ్యక్షులు ఏపీయూడబ్ల్యూజే,

ప్రశ్నించే గొంతుకలను నొక్కేసే యత్నం



విమర్శనాత్మకమైన, స్వతంత్రమైన, పరిశోధనాత్మకమైన పత్రికా స్వాతంత్ర్యం ఏ ప్రజాస్వామిక రాజ్యానికైనా జీవనాడి వంటిది అని నోబెల్ శాంతి బహుమతి గ్రహీత, దక్షిణాఫ్రికా విముక్తి ప్రధాత నెల్సన్ మండేల అభిప్రాయం. కానీ ఆంధ్రప్రదేశ్‌లో ప్రశ్నించే గొంతుకల పట్ల, ప్రత్యేకించి సాక్షి ఎడిటర్ ధనుంజయరెడ్డిపై పోలీసు కేసులు బనాయించి రాష్ట్ర ప్రభుత్వం కక్షగట్టి వ్యవహరిస్తోంది. వీటిని పరిశీలిస్తే రాష్ట్రంలో మీడియా స్వేచ్ఛ ఉందా అనే అనుమానం సహజంగానే తలెత్తుతుంది. ఇది కేవలం సాక్షి సమస్య కాదు. ఈరోజు ఇది సాక్షికి సమస్య కావచ్చు. పాత్రికేయులు, ప్రజాస్వామిక వాదులు మేల్కొకపోతే ఇది రేపు అందరికీ సమస్యగా పరిణమిస్తుంది.

– ఎ.రఘునాథరెడ్డి, కో ఆర్డినేటర్, రాయలసీమ ఆకాంక్షల పోర వేదిక, కడప

బరితెగింపు



పత్రికలను వేధించేందుకు కూటమి ప్రభుత్వం బరితెగించింది. సాక్షి ఎడిటర్ ధనుంజయరెడ్డిపై అక్రమ కేసులు నమోదుచేయడం సరికాదు. ప్రజాస్వామ్య ముసుగులో ని యంత పాలన సాగిస్తారా. ప్రజల తిరుగుబాటు తో నియంతలు వారు ఏలిన దేశాలనే వదిలి వె ళ్లారు. ప్రజాస్వామ్యంలో ఇలాంటివి ప్రజలు హ ర్షించరు. ఇప్పటికైనా పాలకులు తీరు మార్చుకోవాలి.

– అక్కులప్ప, ఐజేయూ జాతీయ కౌన్సిల్ సభ్యులు

ఆక్షేపణీయం



రాజ్యాంగ పరిరక్షణలో కీలకపాత్ర మీడియాది. ప్రజా సమస్యలపై స్పందిస్తున్న 'సాక్షి'పై కక్ష పెంచుకొని ఆ పత్రిక ఎడిటర్, జర్నలిస్టులను తీవ్రంగా ఇబ్బంది పెట్టడం సరికాదు. సోదాల పేరుతో జర్నలిస్టులను భయభ్రాంతులకు గురి చేయడం మంచి పద్ధతి కాదు. ఇది ఆక్షేపణీయం.

– యమలా సుదర్శనం, మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షులు

విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంపొందించాలి

రాజంపేట: విద్యార్థులకు ప్రస్తుత పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలను అందించాలని అన్నమాచార్య యూనివర్సిటీ ప్రో చాన్సలర్ చొప్పా అభిషేక్‌రెడ్డి అన్నారు. గురువారం ఏయూలో స్థిరత్వం వైపు మెకానికల్ ఇంజినీరింగ్‌లో ఉద్భవిస్తున్న సాంకేతికలు, అనే అంశంపై జాతీయస్థాయి ఆన్‌లైన్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ (ఎఫ్‌డీపీ) పోస్టర్‌ను చొప్పా అభిషేక్ రెడ్డి విడుదల చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎఫ్‌డీపీ ద్వారా బోధకుల శక్తి నిల్వ వ్యవస్థలు,సీఎఫ్‌డీ విశ్లేషణ, బయోపదార్థాలు, యంత్ర అధ్యయనం తదితర అంశాలను నేర్చుకోనున్నారన్నారు. ఆధునిక పరిజ్ఞానం ద్వారా అధ్యాపకు లుతమ బోధనలో సాంకేతికతను సమన్వయం చేసుకోవాలన్నారు. ఏయూ వీసీ డాక్టర్ సాయిబాబరెడ్డి, ప్రిన్సిపాల్ నారాయణ, ఏయూ అడ్మిషన్ల డీన్ బి.జయరామిరెడ్డి, సమన్వయకర్తలు దేవరాజ్‌నాయక్, అజయ్‌కుమార్‌రెడ్డిలు పాల్గొన్నారు. ఎఫ్‌డీపీ కార్యక్రమం నవంబరు3 నుంచి 8 వరకు ఆన్‌లైన్ రూపంలో నిర్వహించనున్నారు.



పోస్టర్లను విడుదల చేస్తున్న ఏయూ ప్రో చాన్సలర్ చొప్పా అభిషేక్‌రెడ్డి

మెడికల్ కాలేజీలను ప్రైవేట్‌పరం కానివ్వం

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి

రాజంపేట రూరల్: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నెలకొల్పిన ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేట్ పరం కానివ్వమని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి పేర్కొన్నారు.గురువారం మండల పరిధిలోని శేషమాంబపురం పంచాయతీలోని బాలిరెడ్డిగారిపల్లి గ్రామంలో రచ్చబండ, 'కోటి సంతకాల సేకరణ'కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్య, వైద్యంపై ప్రత్యేక దృష్టి సారించి రాష్ట్రానికి 17 ప్రభుత్వ మెడికల్ కాలేజీలు మంజూరు చేయించారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక అందులో 10 కాలేజీలను ప్రైవేటు పరం చేయాలని నిర్ణయించడం దారుణమన్నారు. ఇవి ప్రైవేట్‌పరమైతే వారు లాభాలు దృష్టిలో ఉంచుకొని పనిచేస్తారని, దీని వల్ల పేద, మధ్య తరగతి ప్రజలు నాణ్యమైన వైద్యాన్ని హక్కుగా పొందే అవకాశాన్ని కోల్పోతారన్నారు. కూటమి ప్రభుత్వం ప్రైవేట్ పరం చేసిన మెడికల్ కళాశాలలను వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకొని ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. వైఎస్ జగన్ మెడికల్ కళాశాలలను తీసుకొచ్చారన్న అక్కసుతో సీఎం చంద్రబాబు వాటిని ప్రైవేట్‌కు అప్పగించాలనుకోవడం దుర్మార్గమన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కోటి సంతకాలు సేకరించి గవర్నర్‌కు పంపి కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకునేలా ఒత్తిడి తెస్తామన్నారు. గ్రామ సర్పంచ్ సుబ్బరాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీహరి, రమణ, శ్రీను, రెడ్డెయ్య, సుబ్బరాజు, భాస్కర్, సుబ్బన్న, ప్రేమ్ జితేంద్ర వర్మ పాల్గొన్నారు.



శేషమాంబపురంలో రచ్చబండ కార్యక్రమం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ఆకేపాటి

మానవ తప్పిదమే

- హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్‌కు ప్రత్యేక సబ్‌స్టేషన్ ఉండగా విద్యుత్ సరఫరా ఎందుకు ఆగింది
- ట్రిప్ కావడానికి కారణాలేమిటి?
- హంద్రీ-నీవా అధికారులు నీటి తరలింపునకే పరిమితమై, వ్యవస్థలను నిర్లక్ష్యం చేశారా

బి.కొత్తకోట: బి.కొత్తకోట మండలం తరిగోడు ఎత్తిపోతల పథకం సమీపంలో పుంగనూరు ఉప కాలువపై 110.950 కిలో మీటర్ (గుండ్లపల్లె) వద్ద గండిపడి తెగిపోవడానికి మానవ నిర్లక్ష్యం ఉందని పలు అంశాలు స్పష్టం చేస్తున్నాయి. శ్రీసత్యసాయిజిల్లా కదిరి సమీపంలోని చెర్లోపల్లె జలాశయం నుంచి కృష్ణా జలాలను కుప్పానికి తరలిస్తున్నారు. ఈ కాలువసాగే మార్గంలో మండలంలోని తరిగోడు సమీపంలోని గుండ్లపల్లె వద్ద బుధవారం ఉదయం కాలువ తెగిపోయింది. దీనికి కారణం మంగళవారం రాత్రి మెరుపులతో తరిగోడు ఎత్తిపోతల పథకానికి విద్యుత్ సరఫరా చేసే లైన్ దెబ్బతిని సరఫరా ఆగిందని అంటున్నారు. అయితే అసలు ఏమి జరిగింది, కాలువ తెగకుండా లేదా తెంపాల్సి వస్తే ఎలాంటి చర్యలు తీసుకోవాలి.. ఒక చోట ఎత్తిపోతల పథకం ఆగితే పైనున్న పథకాలు ఆటోమెటిక్‌గా ఆగిపోవాలి. ఇందులో ఏది జరగలేదు. ఎందుకన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

అనుమానాలెన్నో..

విద్యుత్ సరఫరాలో అంతరాయంవల్ల తరిగోడు ఎత్తిపోతల పథకం పనిచేయలేదని హంద్రీ-నీవా ప్రాజెక్టు అధికారులు అంటున్నారు. ఆ సమస్య ఎందువల్ల వచ్చిందో స్పష్టత లేదు. విద్యుత్ సరఫరా లైన్‌లో అంతరాయం కలగడానికి సరఫరా ఓవర్‌లోడ్, తీగలపై చెట్ల కొమ్మలు పడటం, ఇన్సులేటర్ పగిలిపోవడం లాంటి కారణాలు ఉంటాయి. ఇక్కడ అధికారులు పిడుగుపడిందని, దానివల్లే ఇన్సులేటర్లు దెబ్బతిన్నట్టు అధికారులు చెబుతున్నారు. అయితే పిడుగు పడటం తమకు తెలియదని సమీప గ్రామస్తులు చెబుతున్నారు. దీంతో లైన్ ఎలా దెబ్బతింది, నిర్వహణ సక్రమంగా లేదా, సమస్యను ముందే గుర్తించలేదా అన్న ప్రశ్నలు తలెత్తుతుండగా, ఎత్తిపోతల పథకం వద్ద ట్రాన్స్‌ఫార్మర్‌కు కూడా సాంకేతిక సమస్య ఉన్నట్టు చెబుతున్నారు. ఇది కూడా కారణమా అన్న అనుమానాలు కలుగుతున్నాయి.



గుండ్లపల్లె వద్ద తెగి గండి పడి కాలువ నుంచి బయటకు ప్రవహిస్తున్న నీళ్లు



గండి పూడ్చేందుకు మొదలైన పనులు

తెగినచోటే తెగింది

ఇప్పుడు కాలువతెగిన చోటనే గతంలోనూ కాలువ తెగిందని అధికారులే స్పష్టం చేస్తున్నారు. తరిగోడు పథకం ఆగిన తర్వాత ఇప్పుడు కాలువ తెగిన పైప్రాంతంలో తెంపి నీటిని మళ్లించాలని ప్రయత్నం చేశారు. అయితే ఇప్పటికే ఒకసారి తెగిన చోటనే కాలువ మళ్లీ తెగిపోయి గండిపడింది. దీన్ని పరిశీలిస్తే ప్రాజెక్టు అధికారులు కాలువలోకి నీళ్లు వదలకముందు కాలువ పటిష్టతపై సన్నద్ధం కావాలి. అయితే అలాంటి చర్యలు చేపట్టినట్టు కనిపించడం లేదు. దానిఫలితమే కాలువకు తెగి గండిపడినట్టు స్పష్టం అవుతోంది. నివాసప్రాంతాలు లేనిచోట కాలువ తెగడంతో ప్రమాదం తప్పింది.

ఎస్కేప్ సిస్టం లేదు

ఎగువనుంచి కాలువలో నీటి ప్రవాహం ఆగనప్పుడు కాలువ పక్కన చెరువు లేదా వాగులు ఉన్న ప్రాంతాన్ని ఎంచుకుని అక్కడ కాలువను తెంపి నీటిని మళ్లించాలి. అయితే ప్రస్తుతం కాలువ తెగినచోటనే చెరువు ఉండటంతో నీళ్లు అందులోకి ప్రవహించి నిండాక మరో చెరువులోకి వెళ్లే అవకాశం ఉంది. ప్రతి పంపింగ్ స్టేషన్ (ఎత్తిపోతలు)కి ముందు దగ్గరలో ఉన్న వంకలు, వాగులు, చెరువులను కలిపే విధంగా ఒక ఎస్కేప్ స్ట్రక్చర్ (అధికంగా వచ్చే నీళ్లను వంకలకు మళ్లించే సేఫ్టీ వ్యవస్థ) నిర్మించుకోవాల్సి ఉంటుంది. కానీ ఇది కాలువ మొత్తానికి ఎక్కడా అనుసరించలేదు. దానికి గుండ్లపల్లె వద్ద తెగి గండిన కాలువే నిదర్శనం.

మెకానికల్ వ్యవస్థకు సంబంధించి లోపాలు..

- ఒకే లైన్ లో కాలువమీద పంపులు ఉన్నప్పుడు మధ్యలో ఏదైనా పంప్ స్టేషన్ (ఎత్తిపోతలు) ఆగిపోయి మిగతావి పని చేస్తుంటే నీరు వస్తూనే ఉంటుంది.. అలాంటి ఇబ్బంది వచ్చినప్పుడు, ఏ మోటార్ చెడిపోయినా ఆ పంపు స్టేషన్ స్టాండ్‌బైగా ఉన్న వేరే పంపు స్టార్ట్ అవుతుంది. ఇదిలేదు.
- సిరిస్‌లో ఉన్న పంపులకు సూపర్‌వైజరీ కంట్రోల్ అండ్ డేటా ఆక్విజేషన్ (స్కడ) ఎలక్ట్రో మెకానిల్ టెండర్‌లోనే సాధారణంగా పొందుపరిచి ఉంటారు. అలాంటి వ్యవస్థ ఉంటే (తరిగోడు ఎత్తిపోతల పథకం సమీపంలోని గుండ్లపల్లె వద్ద కాలువ తెగిపోయి గండిపడటం) ఇంతటి పరిస్థితి ఉత్పన్నమయ్యేది కాదు. ఈ విషయంలో మెకానికల్ పనుల ఒప్పందాలను అధికారులు పరిశీలించాల్సి అవసరం ఉంది.
- స్కడ వ్యవస్థ సెన్సార్లు, పంపులు, వాల్వ్‌లు వంటి పరికరాల నుండి వాస్తవ డేటాను సేకరించి కంప్యూటర్‌కు పంపుతాయి. ఇందులో హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్ నెట్‌వర్క్‌లు, మానవ, యంత్ర అనుసంధానత కలిగి ఉంటాయి. ఇవి అందించే సమాచార వ్యవస్థతో ఆపరేటర్లు ఈ సమాచారాన్ని విశ్లేషించి, ప్రమాదాలను నియంత్రించడానికి నిర్ణయాలు తీసుకుంటారు, ఉదాహరణకు..పంపులను ఆన్ లేదా ఆఫ్ చేయడం వంటివి.

ఎస్కేప్, స్కడ లేవు

హంద్రీ-నీవా ప్రాజెక్టుకు సంబంధించి ఎస్కేప్, స్కడ అమలు చేయలేదు. వీటి అవసరం ఇప్పుడు గుర్తించాం. దీనికి సంబంధించిన చర్యలను చేపడతాం. తరిగోడు వద్ద కాలువ తెగిన చోట గతంలోనూ తెగిందని గుర్తించాం. కాలువలో నీళ్లు పూర్తిస్థాయికి చేరి పోర్లుతున్న సమయంలో పైనున్న కాలువను తెగ్గొట్టేందుకు ప్రయత్నించాం. ఈలోగా గండిపడింది.

-విఠల్‌ప్రసాద్, ఎస్ఈ, హంద్రీ-నీవా ప్రాజెక్టు

జీఎస్టీ 2.0తో ప్రజలకు లబ్ధి



ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ నిశాంత్ కుమార్

రాయచోటి: ఒకదేశం-ఒక పన్ను అనే సిద్ధాంతంతో కేంద్ర ప్రభుత్వం 2017లో జీఎస్టీని ప్రవేశపెట్టిన తర్వాత ఇప్పుడు అమల్లోకి వస్తున్న జీఎస్టీ 2.0 దేశంలోని అతి పెద్ద ఆర్థిక సంస్కరణల్లో ఒకటని కలెక్టర్ నిశాంత్ కుమార్ పేర్కొన్నారు. వాణిజ్య పన్నుల శాఖ ఆధ్వర్యంలో గురువారం రాయచోటిలోని శివాలయం సర్కిల్ నుంచి నేతాజీ సర్కిల్ (బంగ్లా) వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని కలెక్టర్ నిశాంత్ కుమార్ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు జీఎస్టీ 2.0 వల్ల కలిగే లబ్ధి గురించి అవగాహన కల్పించడమే లక్ష్యమని తెలిపారు. దీని ద్వారా 99 శాతం వస్తువులపై పన్ను రేట్లు తగ్గి ప్రజలకు లాభం చేకూరుతుందని వివరించారు. టీడీపీ నాయకుడు మండిపల్లి లక్ష్మీ ప్రసాద్ రెడ్డి, డీటీఓ ప్రసాద్, మున్సిపల్ కమిషనర్ రవి, అసిస్టెంట్ కమిషనర్ ఎస్ సౌమ్య పాల్గొన్నారు.

- విద్య, వైద్య, శిశు సంక్షేమ శాఖల సమన్వయంతో సత్ఫలితాలి సాధించాలని, జిల్లాను ముందుకు తీసుకువెళ్లాలని జిల్లా కలెక్టర్ నిశాంత్‌కుమార్ పేర్కొన్నారు. రాయచోటిలోని కన్వెన్షన్ హాల్‌లో పోషణ అభియాన్ కార్యక్రమంలో భాగంగా 8వ రాష్ట్రీయ పోషణ మాసం కార్యక్రమాన్ని ''ఆరోగ్యవంతమైన మహిళా - శక్తివంతమైన కుటుంబానికి బలమైన పునాది'' అనే అంశంపై జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో నిర్వహించిన మాసోత్సవాలు ముగిశాయి. ఈ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. పిల్లల్లో ఊబకాయం, మనం తినే ఆహారంలో కార్బోహైడ్రేట్స్ ఎక్కువగా ఉండటం వల్ల ఏ విధంగా ఆరోగ్య సమస్యలు రావచ్చు దీని గురించి ఈ ఇయర్ థీమ్ పెట్టినట్లు వివరించారు. జిల్లా సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలకు కలెక్టర్ మెమెంటోలను అందించారు. అనంతరం పౌష్టికాహారం స్టాల్స్‌ను సందర్శించారు. కార్యక్రమంలో జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ పీడీ హైమావతి, నగరపాలక సంస్థ కమిషనర్ రవి, ప్రభుత్వాసుపత్రి గైనకాలజిస్ట్ కోటేశ్వరమ్మ, జీసీడీఓ మాధవి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మోసంపై డీఎస్పీకి ఫిర్యాదు

మదనపల్లి:స్థానిక చీకలగుట్టకు చెందిన దంపతులు తనవద్ద డబ్బు, ఆభరణాలను తీసుకుని తిరిగి ఇవ్వకుండా మోసం చేసిన ఉదంతంపై గురువారం హిజ్రా స్వాతి డీఎస్పీ మహేంద్రను కలిసి ఫిర్యాదు చేసింది. ఆ దంపతులనుంచి ఎదురైన పరిస్థితులను బుధవారం మీడియా సమావేశంలో వెల్లడించిన స్వాతి వాటికి సంబంధించిన వివరాలు, డబ్బు తీసుకున్న వాటికి ఆధారాలు, ఆభరణాల వివరాలను వివరించగా చర్యలు తీసుకుంటామని డీఎస్పీ హామీ ఇచ్చారని స్వాతి తెలిపింది. దీనిపై మదనపల్లె రెండో పట్టణ సీఐ రాజారెడ్డిని విచారణకు డీఎస్పీ ఆదేశించారని తెలిపింది.

ఎంపీడీఓ కార్యాలయం ఆకస్మిక తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ ఓబులమ్మ

లక్కిరెడ్డిపల్లి : జెడ్పీ సీఈఓ ఓబులమ్మ గురువారం లక్కిరెడ్డిపల్లి ఎంపీడీఓ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలో సిబ్బంది పనితీరుపై ఆరా తీయడంతోపాటు రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులు పారిశుద్ధ్యంపై దృష్టి సారించేలా గ్రామస్థాయిలో ఎప్పటికప్పుడు గ్రీన్ అంబాసిడర్లను ఏర్పాటు చేసుకోవాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు గ్రామాలలో అందుబాటులో ఉంటూ సర్పంచ్‌లతో కలిసి సమన్వయంతో పనిచేస్తూ అభివృద్ధికి పాటుపడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రెడ్డయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తమ ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్‌గా శ్రీవాణి



శ్రీవాణిని సత్కరిస్తున్న యూనివర్సిటీ అధికారులు

రాజంపేట టౌన్ : రాజంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ తృతీయ సంవత్సరం చదువుతున్న డి.శ్రీవాణి యోగివేమన యూనివర్సిటీ స్థాయిలో ఉత్తమ ఎన్ఎస్ఎస్ వలంటీర్‌గా ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి.పురుషోత్తం, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎల్.రాజమోహన్‌రెడ్డి గురువారం ఇక్కడి విలేకరులకు తెలిపారు. యోగివేమన యూనివర్సిటీలో జరిగిన కార్యక్రమంలో వాణిశ్రీకి యూనివర్సిటీ వైస్ చాన్సలర్, ప్రొఫెసర్ బి.రాజశేఖర్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.పద్మ, ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ ఎస్.వెంకటరామిరెడ్డి ప్రశంసా పత్రాలు అందజేసి సత్కరించినట్లు తెలిపారు. శ్రీవాణి ఆరోగ్యం, పరిశుభ్రత, ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాలు, మొక్కలు నాటడం వల్ల కలిగే ప్రయోజనాలు తదితర అంశాలపై ప్రజల్లో చైతన్యం కల్పించారన్నారు.

రిజిస్ట్రేషన్ శాఖలో.. ఆదాయం ఢమాల్!

- ఈ ఏడాది లక్ష్యం రూ.258.17 కోట్లు , అక్టోబర్ 14వరకు వసూలు రూ.97.19 కోట్లే
- రియల్ ఎస్టేట్ ప్రభావంతోనే భారీగా తగ్గిన ఆదాయం
- రిజిస్ట్రేషన్ చార్జీలు పెంచిన కూటమి ప్రభుత్వం
- లక్ష్య సాధనలో వెనుకబడిన జిల్లాలోని 12 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు

2023-24లో లక్ష్యం - రూ.241.91 కోట్లు
2023-24లో వచ్చిన ఆదాయం - రూ.183.35 కోట్లు
2024-25లో లక్ష్యం - రూ.205.76 కోట్లు
2024-25లో వచ్చిన ఆదాయం - రూ.167.83 కోట్లు
2025-26లో లక్ష్యం - రూ.258.17 కోట్లు
2025-26లో లక్ష్యం - రూ.97.19 కోట్లు



రాయచోటి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

రాయచోటి అర్బన్ : గత రెండేళ్లతో పోల్చుకుంటే రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖలో ఈ ఏడాది ఆదాయం లక్ష్యానికి చాలా దూరంలో నిలిచిపోయింది. స్థిరాస్తి ఆదాయ లక్ష్య సాధనలో వెనుకబాటుకు ప్రధాన కారణం ప్రభుత్వ నిర్ణయాలు, అధికారుల నిర్లక్ష్యాలే కారణంగా తెలుస్తోంది. 2025–26 ఆర్థిక సంవత్సరంలో రూ.258.17 కోట్లు లక్ష్యంగా నిర్ణయించారు. అయితే 2025 అక్టోబర్ 14వ తేదీ వరకు అన్నమయ్య జిల్లాలోని 12 సబ్ రిజిస్టర్ కార్యాలయాల నుంచి కేవలం రూ.97.19 కోట్లు మాత్రమే రాబడి వచ్చింది. ఇదిలా ఉంటే 2023–24 ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించిన లక్ష్యం రూ. 241.91 కోట్లు కాగా, 2023–24లో వచ్చిన ఆదాయం రూ.183.35 కోట్లుగా ఉంది. అలాగే 2024–25 ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించిన లక్ష్యం రూ. 205.76 కోట్లు ఉండగా, 2024–25లో రూ.167. 83 కోట్లు ఆదాయం వచ్చింది. ఈ విధంగా ఉన్న ఆదాయాన్ని పరిశీలిస్తే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలతోనే స్థిరాస్తి ఆదాయం పూర్తిగా పడిపోయినట్లు తెలుస్తోంది.

ఆదాయం తగ్గడానికి ప్రభుత్వ విధానాలే కారణం..

జిల్లాలో రియల్ ఎస్టేట్ వ్యాపారం ప్రభుత్వ విధానాలతో పూర్తిగా కుప్పకూలిపోయింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఫ్రీ హోల్డ్ అసైన్‌మెంట్ భూముల రిజిస్ట్రేషన్‌ను ఆపేసింది. దీనికి తోడు రీసర్వేపై ఉత్కంఠ, భూముల మ్యుటేషన్లలో గందరగోళం నెలకొంది. దీంతో రియల్ ఎస్టేట్ వ్యాపారులు కొత్త వెంచర్లను వేయడానికి వెనకడుగు వేస్తున్నారు. మరో వైపు రిజిస్ట్రేషన్ ఫీజులను భారీగా పెంచడంతో వ్యాపారులపై, పెట్టుబడిదారులపై అధిక భారం పడింది. దీంతో క్రయ విక్రయాలకు వ్యాపారులు ఏ మాత్రం ఆసక్తి చూపడం లేదు. ఫలితంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్లు సగానికి పైగా పడిపోయాయి.

జిల్లాలోని 12 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో భారీగా తగ్గిన ఆదాయం...

అన్నమయ్య జిల్లాలో 12 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. అందులో మదనపల్లె , రాయచోటి, రాజంపేట, పీలేరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఆదాయం రాబడిలో ప్రధానమైనవి. కలికిరి, తంబళ్లపల్లె, వాయల్పాడు, బి.కొత్తకోట, చిట్వేలి, లక్కిరెడ్డిపల్లె, పుల్లంపేట, టి.సుండుపల్లె ఓ మోస్తరుగా రిజిస్ట్రేషన్లు జరిగే కార్యాలయాలు కావడం విశేషం. అయితే జిల్లాలోని 12 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలలో కూడా నిర్దేశించిన ఆదాయంలో సగం కూడా రాబడి రాకపోవడం గమనార్హం. 2025–26 ఆర్థిక సంవత్సరంలో రూ.258.17 కోట్లు లక్ష్యంగా నిర్ణయించగా, 2025 అక్టోబర్ 14వ తేదీ వరకు అన్నమయ్య జిల్లాలోని 12 సబ్ రిజిస్టర్ కార్యాలయాల నుంచి కేవలం రూ.97.19 కోట్లు మాత్రమే రాబడి వచ్చింది.

జిల్లాలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల వారీగా ఆదాయం (అక్టోబర్ 14వ తేదీ వరకు) (రూ.కోట్లలో)..

	కార్యాలయం లక్ష్యం	వచ్చిన ఆదాయం
కలికిరి	8.40	4.11
మదనపల్లె	81.05	39.71
పీలేరు	23.76	11.64
తంబళ్లపల్లె	5.97	2.92
వాయల్పాడు	9.31	4.56
బి.కొత్తకోట	8.66	4.24
చిట్వేలి	6.51	3.19
లక్కిరెడ్డిపల్లె	7.73	3.79
పుల్లంపేట	18.63	9.13
రాయచోటి	57.08	27.97
రాజంపేట	24.68	12.09
టి.సుండుపల్లె	6.89	3.38

తంబళ్లపల్లెలో వింత పాము ప్రత్యక్షం



తంబళ్లపల్లె : తంబళ్లపల్లెలో వింత పాము ప్రత్యక్షమైంది. మల్లయ్యకొండ కింద పొలం పనులకు వెళ్లిన రైతులకు ఈ పాము కనిపించింది. బ్రాహ్మణ బ్లైండ్ స్నేక్ (ఫ్లవర్ పాట్ స్నేక్) గా పిలవబడే ఈ పాము ఆసియా, ఆఫ్రికా ప్రాంతాల్లో మాత్రమే కనిపిస్తుంది. ఈ పాము 1–018 సెంటీమీటర్లు ఉంటుందని అటవీశాఖ అధికారులు చెప్పారు. భూమి లోపల ఉండే పాము వర్షం పడిన సమయాల్లో అరుదుగా బయటకు వస్తుందన్నారు.

అవినీతి ఆరోపణలపై విచారణ

ఓబులవారిపల్లె : చెన్నరాజుపోడు ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ హుస్సేన్ దాదాపు ఆరు లక్షల పదివేల రూపాయలు అక్రమాలకు పాల్పడ్డాడనే ఆరోపణలపై గురువారం ఏపీడీ మృత్యుంజయ, ఎంపీడీఓ విజయారావు, ఎస్ఐ పి.మహేష్‌లు విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఏపీడీ మృత్యుంజయ మాట్లాడుతూ పూర్తిగా విచారించి నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ ఏపీఓ ధనుంజయ, సిబ్బంది పాల్గొన్నారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలకే తొలి ప్రాధాన్యత

యూనియన్ బ్యాంక్ రీజినల్ మేనేజర్ లక్ష్మీతులసి



మాట్లాడుతున్న రీజినల్ మేనేజర్ అడపాల లక్ష్మీతులసి

రాజంపేట టౌన్: ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించడమే తమ తొలి ప్రాధాన్యత అని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కడప రీజియన్ హెడ్ అడపాల లక్ష్మీతులసి తెలిపారు. పట్టణంలోని అమ్మవారిశాల వద్ద ఉన్న యూనియన్ బ్యాంక్‌ను ఆర్ఎస్‌రోడ్డులోని చేజెర్ల కాంప్లెక్స్‌లోకి గురువారం మార్పు చేసిన సందర్భంగా ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ అన్ని రకాల సాంకేతిక సేవలు ఖాతాదారులకు అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. తిరుపతి రీజియన్ హెడ్ శ్రీనివాసకుమార్ మాట్లాడుతూ ఖాతాదారులు సైబర్ నేరాల పట్ల చాలా అప్రమత్తంగా ఉండాలన్నారు. రకరకాల లింక్‌లు సెల్‌ఫోన్‌కు వస్తుంటాయని అయితే కొత్త వారు పంపే లింక్‌లను ఎట్టిపరిస్థితుల్లో ఓపెన్ చేయవద్దని సూచించారు. కార్యక్రమంలో బ్యాంకు అధికారులు మొగిలీశ్వర, వంశీకృష్ణ, ధనుంజయ, అబ్దుల్ లతీఫ్ తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు రోడ్డుప్రమాదాల్లో ముగ్గురికి గాయాలు



ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రామాంజులు

మదనపల్లె రూరల్ : వేర్వేరు రోడ్డుప్రమాదాల్లో ముగ్గురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. తంబళ్లపల్లె మండలం బురదలోళ్లపల్లెకు చెందిన కట్టప్ప కుమారుడు రామాంజులు(22) గ్రామాలకు వెళ్లి గ్యాస్‌స్టవ్‌లు రిపేరీ చేస్తూ జీవిస్తుంటాడు. గురువారం ద్విచక్రవాహనంలో తంబళ్లపల్లెకు వెళుతుండగా, అదే మండలం సిద్ధారెడ్డిగారిపల్లెకు చెందిన శివకుమార్(32) ద్విచక్రవాహనంలో ఎదురుగా వస్తూ రామాంజులు బైక్‌ను ఢీకొన్నాడు. ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడగా, స్థానికులు బాధితులను మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

చికిత్స అనంతరం రామాంజులు పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు. అదేవిధంగా శానిటోరియం తురకపల్లెకు చెందిన గౌసియా(45) స్థానిక దర్గాలో ఉరుసు ఉత్సవం జరుగుతుండగా, బుధవారం రాత్రి అక్కడకు వెళ్లేందుకు రోడ్డు దాటుతోంది. ఈ క్రమంలో అటుగా వేగంగా వచ్చిన కారు ఆమెను ఢీకొంది. ప్రమాదంలో గౌసియా తీవ్రంగా గాయపడగా, స్థానికులు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. తాలూకా పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

చేనేత కార్మికురాలి ఆత్మహత్యాయత్నం

కురబలకోట: మండలంలోని చేనేత నగర్‌కు చెందిన నాగవేణి (32) అప్పుల బాధ తాళలేక బుధవారం రాత్రి ఇంటిలో ఉరివేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. బాధితురాలి కథనం మేరకు.. ఆర్. రాజశేఖర్, నాగవేణి దంపతులు చేనేతనగర్‌కు చెందిన ఓ మగ్గాల యజమాని వద్ద ఆరేళ్ల క్రితం చేనేత మగ్గాలు నేస్తామని రూ. 2.20 లక్షలు అడ్వాన్సుగా తీసుకున్నారు. వారు చేస్తున్న కష్టార్జితం తీసుకున్న అప్పుకు వడ్డీకే సరిపోతోంది. ఇది తీరకుండా బయట పనులకు వెళ్లరాదని యజమాని చెప్పాడు. దీంతో జీవితంపై విరక్తితో ఇంటిలో ఉరివేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కుటుంబీకులు గుర్తించి మదనపల్లి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు గురువారం తెలిపారు.

మద్యం దుకాణంపై దాడి

బి.కొత్తకోట : మద్యం దుకాణంపై దాడిచేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు గురువారం పోలీసులు తెలిపారు. బి.కొత్తకోట సమీపంలోని శెట్టిపల్లికి చెందిన గురునాథ్‌రెడ్డి స్థానిక పీటీఎం రోడ్డులోని డీఎల్ఆర్ మద్యం దుకాణంలో పని చేస్తున్నాడు. స్థానికుడైన హేమంత్ బుధవారం రాత్రి మద్యం దుకాణానికి వచ్చి గురునాథ్‌రెడ్డిని తిట్టి బాటిళ్లు, టేబుళ్లను పడేసి దుర్భాషలాడినట్లు అందిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

విద్యార్థిని చితకబాదిన ఉపాధ్యాయుడు

బ్రహ్మంగారిమఠం: బ్రహ్మంగారిమఠం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థి సుశాంత్‌ను పాఠశాల ఉపాధ్యాయుడు చితకబాదడంతో వాతలు పడ్డాయి. పాఠశాలలో 7వ తరగతి విద్యార్థి సుశాంత్‌ను తెలుగు ఉపాధ్యాయుడు నారాయణ స్వామి కొట్టడంతో వీపుపై చిన్నపాటి గాయాలయ్యాయి. ఈ సంఘటనపై ఏఐఎస్‌బీ జిల్లా కన్వీనర్ సగిలి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ఇందుకు కారణమైన ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

వైద్యం వికటించి మహిళ మృతి

మైదుకూరు : ఓ వైపు ఆర్ఎంపీలు ప్రాథమిక చికిత్స మాత్రమే చేయాలని వైద్య శాఖాధికారులు పత్రికా ప్రకటనలు చేస్తున్నా ఆర్ఎంపీలు అటుంచి ఓ మెడికల్ షాపు నిర్వాహకుడు చేసిన వైద్యం వికటించి ఓ మహిళ నిండు ప్రాణం పోయిన సంఘటన మైదుకూరులో గురువారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక కడప రోడ్డుకు చెందిన ఓ మహిళకు గురువారం మధ్యాహ్నం ఛాతీలో నొప్పి రావడంతో కుటుంబ సభ్యులు ఆమెను అదే రోడ్డులో ఉన్న ఓ మెడికల్ షాపు వద్దకు తీసుకు వచ్చారు. వైద్యం కూడా చేస్తున్న ఆ మెడికల్ షాపు నిర్వాహకుడు సదరు మహిళకు సెలైన్ ఎక్కించి అందులోనే ఇంజక్షన్లను కలిపినట్టు సమాచారం. అది వికటించి మహిళ ప్రాణాలు పోయాయి.

20 రోజుల క్రితం అదృశ్యమై.. కాలువలో శవమై..

- వీడిన మెడికల్ షాపు యజమాని అదృశ్యం మిస్టరీ
- 20 రోజుల తర్వాత హంద్రీ నీవా కాలువలో శవం లభ్యం
- హత్యా.. ఆత్మహత్యా అనే కోణంలో దర్యాప్తు



శ్రీకాంత్ (ఫైల్ ఫొటో)



నీటిలో తేలుతున్న శ్రీకాంత్ మృతదేహం

మదనపల్లె రూరల్ : మెడికల్ షాపు యజమాని శ్రీకాంత్(58) అదృశ్యం కేసు మిస్టరీ వీడింది. 20 రోజుల తర్వాత పుంగనూరు మండలం ఈడిగపల్లె సమీపంలోని యాతాళంవంక వద్ద హంద్రీ నీవా కాలువలో గురువారం శ్రీకాంత్ మృతదేహం లభ్యమైంది. హంద్రీనీవా కాలువలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం తేలియాడుతుండటం గమనించిన స్థానికులు పుంగనూరు పోలీసులకు సమాచారం అందించారు. వారు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని కాలువలో నుంచి బయటకు తీశారు. గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యంపై పోలీసులు మదనపల్లె పోలీస్ స్టేషన్‌లకు సమాచారం అందించారు. దీంతో వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో సెప్టెంబర్ 27న మిస్సింగ్ కేసుగా నమోదైన శ్రీకాంత్ బంధువులకు పోలీసులు సమాచారం అందించారు. వారు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహం శ్రీకాంత్‌దేనని నిర్ధారించారు. మృతదేహాన్ని తరలించేందుకు వీలు లేకపోవడంతో దొరికిన చోటే పోస్టుమార్టం నిర్వహించారు. పట్టణంలోని చిత్తూరు బస్టాండ్‌లో గాయత్రి మెడికల్ షాపు నిర్వహిస్తూ రోజా ఫ్లాట్స్‌లో నివాసం ఉంటున్న శ్రీకాంత్, రాయచోటికి వెళ్లి వస్తానని భార్య గాయత్రితో చెప్పి సెప్టెంబర్ 26న ఇంటి నుంచి బయలుదేరాడు. తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు అతని ఆచూకీ కోసం గాలించారు. అయితే మరుసటిరోజు మండలంలోని చిప్పిలి సమీపంలోని హంద్రీనీవా కాలువ ఒడ్డున శ్రీకాంత్‌కు సంబంధించి స్కూటీ వాహనం, సెల్‌ఫోన్ లభించాయి. దీంతో పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది హంద్రీ నీవా కాలువలో గాలించారు. ఎలాంటి ఫలితం లేకపోవడంతో, వన్‌టౌన్ పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి విచారణ కొనసాగించారు. కుటుంబ సభ్యులు శ్రీకాంత్ వాహనం వదిలేసి, ఎక్కడికైనా వెళ్లి ఉంటాడని భావించారు. అయితే 20 రోజుల తర్వాత పట్టణానికి 15 కిలోమీటర్ల దూరంలో శ్రీకాంత్ శవమై కనిపించడంతో కుటుంబ సభ్యులు విషాదంలో మునిగిపోయారు. శ్రీకాంత్‌ను హత్యచేశారా... లేదా ఆత్మహత్య చేసుకున్నాడా అన్నది పోలీసుల దర్యాప్తులో వెల్లడికావాల్సి ఉంది. కాగా శ్రీకాంత్ మృతదేహానికి కాలి చెప్పులు కూడా అలాగే ఉండటంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కుటుంబ సభ్యులు, స్నేహితుల ద్వారా పోలీసులు వాస్తవాలను సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. శవం లభ్యమైన ప్రాంతం పుంగనూరు పోలీస్ స్టేషన్ పరిధిలో ఉండటంతో వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లారీని ఢీ కొన్న కంటైనర్



లారీలో ఇరుక్కుపోయిన డ్రైవర్‌ను బయటకు తీస్తున్న పోలీసులు

ఓబులవారిపల్లె : మండలంలోని అమృతవారిపల్లి జాతీయ రహదారి వద్ద గురువారం తెల్లవారుజామున ఎదురుగా వస్తున్న లారీని కంటైనర్ లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో లారీ ముందుభాగం దెబ్బతినడంతో డ్రైవర్ క్యాబిన్‌లో ఇరుక్కుపోయాడు. ఎస్ఐ పి.మహేష్ నాయుడు తన సిబ్బందితో ప్రమాద స్థలానికి చేరుకొని క్రేన్ సహాయంతో లారీలో ఇరుక్కుపోయి ఉన్న డ్రైవర్‌ను బయటకు తీశారు. అనంతరం 108 వాహనంలో రైల్వేకోడూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. హైదరాబాదు నుంచి చెన్నైకు వెళ్తున్న కంటైనర్ లారీ వేగంగా ఎదురుగా వస్తున్న మరో లారీని ఢీ కొనడంతో ఈ ప్రమాదం జరిగింది. డ్రైవర్ విజయ్ కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పి.మహేష్ నాయుడు తెలిపారు.

కారు ఢీకొని ఇద్దరికి గాయాలు



రోడ్డు ప్రమాదంలో గాయపడిన మలికార్జున, బుజ్జయ్య

కలకడ : ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలైన సంఘటన గురువారం మండలంలోని కోన గ్రామంలో జరిగింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. నంద్యాల జిల్లా అహోబిలానికి చెందిన మల్లికార్జున, నెల్లూరు జిల్లా రాపూరుకు చెందిన బుజ్జయ్య కోన గ్రామం వద్ద బొగ్గులు కాల్చుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వారు ద్విచక్ర వాహనంలో కోన గ్రామం బస్టాండు వద్దకు వెళ్తుండగా కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో ఒకరికి కాలు విరగగా, మరొకరికి తలకు రక్త గాయమైంది. క్షతగాత్రులను 108 వాహనంలో పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కలకడ పోలీసులు కేసు నమోదు చేశారు.

అరుదైన శస్త్ర చికిత్స



పేషెంట్‌తో వైద్య బృందం

రాయచోటి టౌన్: రాయచోటి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో థైరాయిడ్‌కు అరుదైన శస్త్ర చికిత్స చేసి పెద్ద సైజు గడ్డను తొలగించారు. రాయచోటి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో గురువారం ఆర్ఎంఓ డాక్టర్ డేవిడ్ సుకుమార్ విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. రాయచోటి పట్టణానికి చెందిన శారదమ్మ (65) థైరాయిడ్ జబ్బుతో సుమారు నాలుగేళ్లుగా బాధపడుతోంది. నెల రోజుల క్రితం తీవ్ర అనారోగ్యంతో ఆసుపత్రికి వచ్చింది. డాక్టర్ శైలేష్, డాక్టర్ లక్ష్మీప్రసాద్ చర్చించి ఆమెకు వైద్య పరీక్షలు చేయించారు. గొంతులో సుమారు 10 సెంటీమీటర్ల వ్యాసార్థంతో గడ్డ ఉన్నట్లు గుర్తించారు. వెంటనే ఈఎన్‌టీ డాక్టర్ నరసింహ సహకారంతో అనస్థియా డాక్టర్లు డాక్టర్ వెంకట శివ, డాక్టర్ అనిల్, డాక్టర్ బండారు కిరణ్ కుమార్‌లు సుమారు రెండున్న గంటల పాటు శ్రమించి శస్త్ర చికిత్స చేసి గొంతులో ఉన్న గడ్డను తొలగించారు.

ఆత్మహత్యలను ఆపి.. ప్రాణాలు నిలిపి..



మహిళను కాపాడి కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న రైల్వే పోలీసులు



రామాంజనేయులును కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న రైల్వే పోలీసులు

- ఎర్రగుంట్ల రైల్వే పోలీసుల చొరవతో నిలిచిన రెండు నిండు ప్రాణాలు
- శభాష్ పోలీస్ అంటూ ప్రశంసలు

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల రైల్వే పోలీసుల చొరవతో ఇద్దరి నిండు ప్రాణాలు నిలిచాయి. కుటుంబ కలహాలతో మనస్థాపానికి గురై ఆత్మహత్య చేసుకోవాలని రైలు పట్టాలపైకి రాగా రైల్వే పోలీసులు గమనించి వారిని కాపాడి కుటుంబ సభ్యులకు అప్పగించారు. గురువారం ఎర్రగుంట్ల రైల్వే స్టేషన్‌లో జరిగిన ఈ సంఘటనలకు సంబంధించిన వివరాలిలా..

వేంపల్లికి చెందిన సుందరి సుమంజలి అనే మహిళ కుటుంబ కలహాల కారణంగా మనస్థాపానికి గురై ఆత్మహత్య చేసుకోవాలని ఎర్రగుంట్ల రైల్వే స్టేషన్‌కు వచ్చింది. రైలు పట్టాలపై పడుకొని ఉండటాన్ని ఎర్రగుంట్ల రైల్వే కానిస్టేబుళ్లు డి.వీరనారాయణ, శ్రీనివాసరావులు గమనించారు. వెంటనే రైల్వే ట్రాక్‌పై ఉన్న సుందరి సుమంజలిని కాపాడారు. తర్వాత రైల్వే పోలీస్ స్టేషన్‌కు తీసుకుని వచ్చి వివరాలు సేకరించారు. ఆమె భర్తను పిలిపించి ఇద్దరికి కౌన్సెలింగ్ ఇచ్చారు. పిల్లలతో సంతోషంగా జీవించాలని నచ్చజెప్పి ఇంటికి పంపించారు.

మద్యం మత్తులో..

ప్రొద్దుటూరుకు చెందిన రామాంజనేయులు అనే వ్యక్తి ఇంటిలో గొడవ పడి అతిగా మద్యం తాగి ఎర్రగుంట్లకు వచ్చాడు. రైలు కింద పడి చనిపోవాలని రైలు పట్టాలపై పడుకున్నాడు. అదే సమయంలో డ్యూటీలో ఉన్న కానిస్టేబుళ్లు డి. వీరనారాయణ, రామాంజనేయరెడ్డిలు వెంటనే స్పందించి పట్టాలపై ఉన్న రామాంజనేయులును కాపాడి పోలీస్ స్టేషన్‌కు తీసుకుని వచ్చారు. తర్వాత అతని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వారిని పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించి అప్పగించారు. ఈ రెండు సంఘటనల్లోనూ రైల్వే పోలీసులు చూపిన చొరవను చూసిన వారు శభాష్ పోలీస్ అంటూ ప్రశంసించారు.

అభివృద్ధి మరచిన ప్రభుత్వం



మాట్లాడుతున్న సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీ కేంద్ర పొలిట్ బ్యూరో సభ్యుడు వి. శంకర్

రాయచోటి టౌన్ : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అభివృద్ధిని విస్మరించిందని సీపీఐఎంఎల్ లిబరేషన్ కేంద్ర పోలిట్ బ్యూరో సభ్యుడు వి. శంకర్ విమర్శించారు. గురువారం రాయచోటి ఎన్జీఓ హోంలో సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ అన్నమయ్య జిల్లా కార్యదర్శి మావులూరి విశ్వనాథ అధ్యక్షతన రాయలసీమ ముఖ్య కారకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర సంపదను కార్పొరేట్ సంస్థలకు అప్పగించే పనిలో ఉన్నారని ఆరోపించారు. రాష్ట్ర కార్యదర్శి డి. బంగారాజు మాట్లాడుతూ రాష్ట్రంలో కార్పొరేట్, మతతత్వ మనువాద శక్తులను అరికట్టకపోతే ప్రజలు తీవ్రంగా నష్టపోతారన్నారు. డిసెంబర్ 6,7 తేదీలలో కడపలో నిర్వహించే రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఉదయ్ కిరణ్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు సిగి చెన్నయ్య, రఘునాథ నాయుడు, సుజాత, లవకుమార్ పాల్గొన్నారు.